# ప్రజలే నా కుటుంబ సభ్యులు

- అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా
- ఈ మట్టిలో పుట్టిన బిడ్డను.. మాటకు కట్టుబడి ఉంట
- ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించండి
- మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు
- భూపాలపల్లి జడ్పీ, మంథని బల్దియా చైర్‌పర్సన్లు శ్రీహర్షిణి, శైలజతో కలిసి నామినేషన్ దాఖలు

మంథని, నవంబర్ 8: 'ఈ మట్టిలో పుట్టిన బిడ్డను.. నియోజకవర్గ ప్రజలే నా కుటుంబ సభ్యులు.. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా' అంటూ మంథని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ప్రకటించారు. భూపాలపల్లి జడ్పీ, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్లు జక్కు శ్రీహర్షిణి, పుట్ట శైలజ, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది శశి కాంత్‌కాచేతో కలిసి బుధవారం మంథనిలోని ఆర్వో ఆఫీస్‌లో మధు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీసీ బిడ్డనైన తనకు సీఎం కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్‌ఎస్ నుంచి మూడోసారి మంథని ఎమ్మెల్యేగా అవకాశం వచ్చిందన్నారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఈ ప్రాంతాన్ని గణనీయంగా అభివృద్ధి చేశానని చెప్పారు. తన తల్లి పుట్ట లింగమ్మ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. మళ్లీ దీవించి అసెంబ్లీకి పంపిస్తే అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ విద్యార్థులకు హైదరాబాద్‌లో ఉండి చదువుకునేందుకు రెండు హాస్టళ్లను సొంతంగా ఏర్పాటు చేస్తామన్నారు. నిరుపేదలకు సామూహిక వివాహాలు, ఇల్లు లేని వారికి గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి సొంతంగా సాయం చేస్తానని భరోసానిచ్చారు. తనను గెలిపిస్తే సీఎం కేసీఆర్ వెయ్యి కోట్లు ఇస్తానని ఆశీర్వాద సభలో ప్రకటించడం ఆనందంగా ఉన్నదన్నారు. ఈ నిధులతో మహదేవపూర్ ఐటీడీఏ కేంద్రం, ఆరెంద మానేరుపై బ్రిడ్జి నిర్మాణం తదితర పనులు చేస్తానని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన తనను మంథని నుంచి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు.



నామినేషన్ అనంతరం సతీమణి శైలజకు షేక్ హ్యాండ్ ఇస్తున్న మధు



జవహర్ నగర్ కాలనీలో నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

# కాంగ్రెస్ తూటాలేని తుపాకీ

- రెండెకరాలున్న వ్యక్తి వేలకోట్లకు అధిపతి ఎట్ల అయిండో ప్రశ్నించండి
- జిల్లా కేంద్రంలో వెయ్యి ఇండ్లు నిర్మించి పేదలకు ఇచ్చిన
- శ్మశాన వాటిక, డ్రైనేజీని నిర్మించి, కాలనీకి రేషన్ షాపు తెప్పిస్తా
- ఒక్క ఓటు వేస్తే.. నియోజకవర్గానికి ముగ్గురం సేవలందించినం
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, నవంబర్ 8 : కాంగ్రెస్ పార్టీ తూటాలేని తుపాకీ లాంటిదని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీశ్‌రెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ నూనె రాజు పటేల్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని 8, 27వ వార్డులు జవహర్ నగర్‌కాలనీ, రెవెన్యూ కాలనీల్లో ఎమ్మెల్యే గండ్ర ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి ప్రాంతం, అభివృద్ధిపై అవగాహన వారి అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2009లో గుంతలతో ఉన్న ప్రధాన రహదారిని వేల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశానన్నారు. వార్డుల్లో బస్తీబాట నిర్వహించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించానన్నారు. జవహర్ నగర్ కాలనీ అండర్ గ్రౌండ్‌లో ఉన్నదని, ఇండ్ల పట్టాలు ఇవ్వమంటే తాను ముందుండి సింగరేణితో మాట్లాడి ఇండ్ల పట్టాలు ఇప్పించానన్నారు. పుల్లూరిరామయ్యపల్లి, గడ్డిగానిపల్లి, కాశీంపల్లి, జంగేడు, కేటీకే ఓసీ, బాంబుల గడ్డలో శ్మశాన వాటికలు నిర్మించానన్నారు. సింగరేణి కార్మికులకు రెండు విడతలుగా రెండు వేల క్వార్టర్లు నిర్మించి ఇచ్చానని, గూడులేని పేదలకు వెయ్యి డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించి అందించానన్నారు. కాంగ్రెస్ నాయకులు తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, చేసిన అభివృద్ధిని చెప్పడం లేదన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకొచ్చానని, జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 550 పడకలతో 150మంది సిబ్బందితో కార్పొరేట్ వైద్యం అందుతున్నదన్నారు. రెండెకరాల భూమి ఉన్న వ్యక్తి వేలకోట్లకు ఎలా అధిపతి అయ్యాడో ప్రతిపక్ష నాయకున్ని ప్రజలు ప్రశ్నించాలన్నారు. ఒక్కసారి జడ్పీటీసీ అయి నిరుపేదలు తినే రేషన్ బియ్యం అమ్ముకున్న నీచ చరిత్ర వారిదన్నారు. తనను మళ్లీ ఆశీర్వదిస్తే రూ. 100 కోట్లతో బైపాస్ రోడ్డు వేయిస్తానని, జవహర్ నగర్ కాలనీ ప్రజల కోరిక మేరకు శ్మశాన వాటిక, డ్రైనేజీలు నిర్మిస్తానన్నారు. నూతన రేషన్ షాపు కూడా ఏర్పాటు చేయిస్తానన్నారు. పట్టాలు లేని ఇండ్లకు ముందుండి పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్‌లో ఇండ్లు రాని వారికి గృహలక్ష్మి ద్వారా ఇండ్లు నిర్మించి ఇస్తామని అన్నారు.

**బీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు**

జవహర్‌నగర్ కాలనీలోని కాంగ్రెస్‌కు చెందిన 50మంది నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీశ్‌రెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ నూనె రాజు పటేల్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గండ్ర గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలోబీఆర్‌ఎస్ రాష్ట్ర యూత్ నాయకుడు గండ్ర గౌతంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు జనార్దన్, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, కౌన్సిలర్లు జక్కం రవి కుమార్, 8, 27 వార్డుల అధ్యక్షులు లక్కం దేవేందర్, కవ్వంపెల్లి శేఖర్, నాయకులు బీబీచారి, విజయ్, మంతెన రాజేశ్, రాములు యాదవ్, మోతె రాజు, బోయిన అనిల్ కుమార్, యూత్ నాయకులు బుర్ర రాజు, శ్రీకాంత్ పటేల్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆదరించండి

- సంచులక్కను నిలదీయండి
- కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కులేదు
- నాటి ములుగు, నేటి ములుగుకు ఉన్న తేడాలను గమనించండి
- ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి
- వెయ్యి మందితో జిల్లా కేంద్రంలో రోడ్‌షో

ములుగు, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : చిన్న జిల్లాలతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం కేసీఆర్ ములుగును జిల్లాగా ఏర్పాటు చేసి కనీవినీ ఎరుగనిరీతిలో అభివృద్ధి చేశారని, ఇది చూసి బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఆదరించాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శాంతి స్తూపం నుంచి బస్టాండ్ మీదుగా వెయ్యి మంది కార్యకర్తలతో రోడ్ షో నిర్వహించారు. కోయ కొమ్ము నృత్యాలు, డప్పు చప్పుళ్లతో ములుగు పట్టణం దద్దరిల్లింది. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న షాపుల్లో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలు పంచుతూ వ్యాపారులు, ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్టం ఏర్పడిన తర్వాత అన్ని ప్రాంతాలపై పూర్తి అవగాహన ఉన్న సీఎం కేసీఆర్ ములుగు నియోజకవర్గాన్ని సైతం ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. 2018 ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ములుగును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. అభ్యర్థి ఓడిపోయినా ఇచ్చిన మాట ప్రకారం 9మండలాలతో ములుగును జిల్లాగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అన్ని జిల్లాలతో సమానంగా నిధులు, అధికారులను కేటాయించి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పాలన చేరువ చేశారన్నారు. సీతక్క రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ఓట్ల కోసం ఇంటింటా తిరుగుతున్న కాంగ్రెస్ నాయకులను, అభ్యర్థి సీతక్క అలియాస్ సంచులక్కను చేసిన పనిపై నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ములుగును అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్ ములుగు ప్రజలపై ఎంతో నమ్మకంతో పేద కుటుంబానికి చెందిన నాగజ్యోతిని అభ్యర్థిగా నిలిపారని అన్నారు. నాటి ములుగు.. నేటి ములుగును బేరీజు వేసుకొని నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లాకు మెడికల్ కళాశాల, 300 పడకల దవాఖాన మంజూరు చేయడంతో పాటు మల్లంపల్లి మండల ఏర్పాటు, ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారన్నారు. పోడు భూములకు పట్టాలిచ్చి గిరిజనుల స్వప్నాన్ని నెరవేర్చారని తెలిపారు. రోడ్ షోలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, వెంకటాపూర్ మండల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు, ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్‌కుమార్, నాయకులు సకినాల శశికాంత్, వేములపల్లి భిక్షపతి, పోదెం కృష్ణప్రసాద్, దూడబోయిన శ్రీనివాస్, నాజర్‌ఖాన్, తైరెడ్డి మహేందర్‌రెడ్డి, గజ్జి నగేశ్, మేర్గు సంతోష్, దొడ్డిపల్లి రఘుపతి, కాకి పురుషోత్తం, మహేందర్, శరత్ పాల్గొన్నారు.



ములుగు పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణుల భారీ రోడ్ షో



కోయ వేషధారణలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో భద్రాచలం బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్

# కొత్తూరు జీపీలో కాంగ్రెస్‌కు భారీ షాక్

- బీఆర్‌ఎస్‌లో చేరిన ఆ పార్టీకి చెందిన వంద కుటుంబాలు
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావ్

పర్ణశాల, నవంబర్ 8 :దుమ్ముగూడెం మండలం కొత్తూరు గ్రామ కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సుమారు వంద కుటుంబాలు భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్, మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో పిసోడి ముత్తయ్య, గడ్డం సమ్మయ్య, కట్టం నాగరాజు, దొబ్బిడి రాజు, కట్టం రాములు, పాయం వెంకటేశ్, కుర్సం రాముడు, కుర్సం ప్రసాద్, పాయం చిన్న వెంకటేశ్, పిసోడి సురేశ్, పిసోడి పెంటయ్య, పాయం భీమరాజు ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పాయం వెంకటేశ్, తోట రమేశ్‌గౌడ్, ఎండీ నవాబ్, ఉబ్బ వేణు, సర్పంచ్ సరియం సీతారామయ్య, కల్లూరి ఆదినారాయణ, ఉబ్బ సంపత్, బాలకృష్ణ, చంటిబాబు, చిన్నబాబు, రాజు పాల్గొన్నారు.